వెంకటేశ్వరుని సన్నిధిలో కోలగట్ల

తిరుమల వెంకటేశ్వరుడిని ఆదివారం తెల్లవారుజామున డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దర్శించుకున్నారు. జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు చేసినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంటనే వైసిపి నాయకులున్నారు. - ప్రజాశక్తి, విజయనగరంటౌన్

టిడ్కో ఇళ్ల వద్ద పూర్తికాని రోడ్డు నిర్మాణం

టిడ్కో గృహ లబ్ధిదారులకు జి ప్లస్ త్రీ గృహాలు నిర్మించిన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మరోవైపు ఈ కాలనీల ప్రారంభాన్ని ప్రభుత్వం వాయిదా వేస్తూ రావడంతో ఇళ్లన్నీ పాడైపోయే పరిస్థితి దాపురిస్తోంది. సుదీర్ఘకాలంగా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు నిరాశే ఎదురవుతోంది. ఎప్పటికి ఇళ్లు అప్పగిస్తారో తెలియక లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇళ్ల పంపిణీని వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నారు తప్ప అప్పగించడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు

ప్రహసనంగా మారిన టిడ్కో

- పూర్తికాని మౌలిక వసతులు
- పెచ్చులు ఊడుతున్న నిర్మాణాలు
- తుప్ప పడుతున్న కిటికీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలో సారిపల్లి వద్ద 2656, సోని నగర్ వద్ద 1320 ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపి టిడ్కో) ఇళ్లను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణ పనులకు టెండర్లు పిలిచింది. వైసిపి అధికారం లోకి వచ్చి మూడేళ్లయినా గృహ నిర్మాణాలను పూర్తి చేయకుండా తీవ్ర జాప్యం చేస్తోంది. సిపిఎంతోపాటు ఇతర విపక్షాలు ఆందోళనలు నిర్వహించడంతో ప్రభుత్వం ఒకింత దిగి వచ్చి 800 మంది వరకు ఇళ్ల తాళాలు అప్పగించింది. అయితే వారు ఇంట్లో ఉండేందుకు పూర్తి స్థాయి నిర్మాణం చేపట్టి అప్పగించ లేదు. రోడ్లు, కాలువలు, తాగునీటి హెడ్ ట్యాంకులు, వాటర్ పైపులైన్లు, విద్యుద్దీపాలు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్లకు సంబంధించి పనులను అసలు ప్రారంభించలేదు. యుజిడి మంచినీటి వ్యవస్థలను కూడా ఏర్పాటు చేయలేదు. విద్యుత్తు శాఖ నుంచి విద్యుత్ పోల్స్, లైన్లు ఏర్పాటు కాలేదు. కేవలం ఒక్క లైను మాత్రమే విద్యుత్తు స్తంభాలు వేసి, లైన్లు ఇచ్చారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు విద్యుత్తు కనెక్షన్లు కూడా ఇవ్వలేదు.

తుప్ప పట్టిన కిటికీలు

సుదీర్ఘ జాప్యం కావడంతో కొన్ని ఇళ్లు పాడైపోయే పరిస్థితి నెలకొంది. కిటికీలు చెదలు పట్టి, తలుపులు పగిలిపోయి, షేడ్‌లు పెచ్చులూడి పోతున్నాయి.

లబ్ధిదారుల్లో ఆందోళన

నగరంలో అద్దె భారాన్ని తగ్గించుకునేందుకు లబ్ధిదారులు అప్పులు చేసి వేలాది రూపాయలు డిపాజిట్లు చెల్లించారు. కానీ నాలుగున్నర ఏళ్లు అయినా ఇప్పటికీ వారికి ఇళ్లు అందుబాటులోకి రాలేదు. దీంతో ఇళ్ల అద్దెలతోపాటు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించుకోలేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికి ఇళ్లు ఇస్తారోనని ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో ఇప్పటికైనా ఇళ్లు అప్పగిస్తారో? లేదో, తాళాలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందా? అని ఆందోళన చెందుతున్నారు.

నత్తనడకన మౌలిక వసతుల పనులు

టిడ్కో గృహాల లబ్ధిదారులను ప్రభుత్వం గుర్తించి, వారి నుంచి ముందస్తు డిపాజిట్లు తీసుకుంది. ఈ పథకం కింద లబ్ధిదారులకు కేంద్రం ప్రభుత్వం రూ.1.50 లక్షల రాయితీ అందజేస్తోంది. ప్రభుత్వం మూడు కేటగిరీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఎ- కేటగిరీ (300 చదరపు అడుగులు), బి-కేటగిరీ (364 చదరపు అడుగులు), సి-కేటగిరీ (430 చదరపు అడుగులు) విస్తీర్ణంలో నిర్మించారు. ఎ- కేటగిరీలోని ఇళ్లను లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగానే రిజిస్ట్రేషన్లు చేస్తోంది. బి-కేటగిరీ గృహ నిర్మాణానికి రూ.7.65 లక్షలు ఖర్చవుతోంది. లబ్ధిదారుల వాటాగా రూ.50 వేలు చెల్లించారు. సి-కేటగిరీకి రూ.8.65 లక్షలు ఖర్చవుతోంది. లక్ష రూపాయలు లబ్ధిదారుని వాటాగా చెల్లించారు. ఈ రెండు కేటగిరీల్లోని లబ్ధిదారులు మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా ద్వారా సమకూర్చుకుని టిడ్కో సంస్థకు చెల్లించాలి.

నిర్మాణ దశలో ఉన్న తాగునీటి ట్యాంకులు

పథకాలకు అర్హతే ప్రామాణికం

పింఛన్ల పంపిణీలో మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లిలో పింఛను మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-చీపురుపల్లి

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలను అందిస్తున్నామని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. చీపురుపల్లి ప్రభుత్వ బాలుర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ పింఛను కానుక కార్యక్రమానికి మంత్రి బొత్సతోపాటు జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ సూర్యకుమారి హాజరయ్యారు. కొత్త పింఛనుదారులకు పింఛను మంజూరు పత్రాలు, హౌసింగ్ పట్టాలను మంత్రి అందజేశారు. అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ముందుగా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో 9 వేల పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి పేదవాడికి కూడా తప్పనిసరిగా పింఛను వచ్చేలా పనిచేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛను ఇచ్చే రోజులు ఉన్నాయా? అని ప్రజలను మంత్రి అడిగారు. గత ప్రభుత్వంలో పింఛన్ కావాలన్నా, ఒక రేషన్ కార్డు రావాలన్నా లంచం ఇస్తే గాని పని జరిగేది కాదన్నారు. అలాంటిది వైసిపి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలు, పింఛన్లు, రేషన్ కార్డులు వంటివి ఏవైనా లంచాలకు, అవినీతికి తావు లేకుండా అందజేస్తున్నారని పేర్కొన్నారు.

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ చీపురుపల్లి నియోజకవర్గంలో కొత్తగా 1250 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. రైతు పండించే ధాన్యాన్ని ప్రభుత్వమే స్వయంగా రైతుల దగ్గర కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కష్టకాలంలోనూ సంక్షేమ కార్యక్రమాలు ఆపకుండా యథావిధిగా కొనసాగిస్తున్నామని తెలిపారు.

కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ అర్హత లేకుండా పింఛను అందుకుంటున్నట్లు ఎవరికైనా తెలిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని, తప్పనిసరిగా వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. జిల్లాలో ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు చాలా కష్టపడి పనిచేస్తున్నారని వారికి అభినందనలు తెలిపారు. కరోనా మహమ్మారి మళ్లీ వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఇంకా ఎవరైనా వ్యాక్సిన్ వేసుకోకుంటే, వెంటనే వేసుకోవాలని కోరారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే తప్పనిసరిగా ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లాలో 8,999 మంది నూతన పింఛనుదారులతోపాటు మొత్తం 2,83,098 మందికి ఈ నెల నుంచి పింఛన్ల పంపిణీ చేపడుతున్నట్టు డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి వెల్లడించారు. కార్యక్రమంలో బొత్స సందీప్, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

విజయనగరంలో పింఛను మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

విజయనగరంటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్లను అందజేసే కార్యక్రమాన్ని ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. నూతనంగా 1,065 మంది లబ్ధిదారులకు పింఛన్లను మంజూరు చేశారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని నేతగా సిఎం జగన్ ప్రతి పథకాన్ని అవినీతి రహితంగా అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతిదేవి, కార్పొరేటర్లు గుజ్జల నారాయణరావు, కంటుభుక్త తవిటి రాజు, కనకల నాగవల్లి, టిపిఆర్‌ఒ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్స సత్యనారాయణకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న కలెక్టర్ సూర్యకుమారి ; న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

నూతన సంవత్సర సందడి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కేకులు కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ స్వగృహంలో మంత్రికి, ఆయన సతీమణి ఝాన్సీలక్ష్మికి పెద్దసంఖ్యలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, తదితరులు శుభాకాంక్షలు అందజేశారు.

కలెక్టర్ క్యాంప్ ఆఫీసులో కలెక్టర్ ఎ.సూర్యకుమారికి అధికారులు, ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు, ఎస్‌డిసిలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఛాంబర్లో జెసి మయూర్ అశోక్‌కి అధికారులు, సిబ్బంది న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా సహాయ సంచాలకులు డి.రమేష్ కేక్ కట్‌చేసి, అందరికీ శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణకు, కలెక్టర్ ఎ.సూర్యకుమారికి, జెసి మయూర్ అశోక్‌కు ఎడి రమేష్ ఆధ్వర్యంలో, డివిజనల్ పిఆర్ఒ ఎస్.జానకమ్మ, ఇతర సిబ్బంది వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్‌డిఒ సూర్యకళ

అక్కడి వారికి ఇక్కడెలా?

- నెల్లిమర్లలో చనమల్లపేట వాసులకు ఇళ్ల పట్టాలు
- నగర పంచాయతీలో 1400 మంది పేదలకు ఇంకా ఇవ్వని స్థలాలు
- అధికారుల తీరుపై అనుమానాలు



చనమల్ల మంగమ్మ, పతివాడ కుమారి పేరుతో ఉన్న పట్టాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీలో సుమారు 1400 మంది పేదలున్నట్లు ఇటీవల ప్రభుత్వం గుర్తించి వారికి ఇళ్ల స్థలాల కోసం పట్టాలిచ్చింది. కానీ ఎవరికీ స్థలాలను అప్పగించలేదు. దీనికి కారణం నెల్లిమర్లలో సరిపడా ప్రభుత్వ భూములు లేవని అధికారులు చెబుతున్నారు. అయితే ఇక్కడున్న పేదలకు స్థలాలు ఇవ్వడానికి లేవని చెబుతున్న అధికారులు... నెల్లిమర్ల నడిబొడ్డున ఉన్న గాంధీనగర్ కాలనీ సమీపంలో గుషిని పంచాయతీ చనమల్లపేట వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం గమనార్హం. ఎన్నో ఏళ్లుగా నగర పంచాయతీలో నివాసముంటూ ఇళ్లు లేని నిరుపేదలను కాదని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి ఇక్కడ ఎలా స్థలాలు కేటాయించారో అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది.

మండలంలోని గుషిని మాజీ సర్పంచ్, చనమల్లపేటకు చెందిన చనమల్ల మంగమ్మ, పతివాడ కుమారి పేరిట 2014లో నెల్లిమర్లలో ఇళ్ల పట్టాలు జారీ చేసినట్లు తహశీల్దార్ కార్యాలయం పేరిట రాజముద్రతో పట్టాలు లభ్యం కావడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. గత కొంతకాలంగా పాత తేదీలతో కొన్ని పట్టాలు ఉన్నట్లు చర్చ జరిగినా వాటిపై ఎటువంటి ఆధారాలూ లేవు. అయితే చనమల్లపేటకు చెందిన వారి పేరిట తాజాగా పట్టాలు వెలుగులోకి రావడంతో అది నిజమేనని తెలుస్తోంది. కొంతమంది నాయకులు, రెవెన్యూ అధికారులు కలిసి లక్షల్లో వసూలు చేసి ఖాళీ స్థలాలను అమ్మేసినట్లు ఈ పట్టాలను చూస్తే తేటతెల్లమవుతోంది. ఇలా ఒక చనమల్లపేటకు చెందిన వారే కాకుండా జరజాపుపేట, కొండగుంపాం తదితర గ్రామాలకు చెందిన వారికి వద్ద నుంచి కూడా పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి పాత తేదీలు వేసి కొత్త పట్టాలు ఇచ్చేసినట్లు బోగట్టా.

1400 మందికి స్థలాలిస్తారా?

నగర పంచాయతీలో సుమారు 1400 మంది పేదలను ప్రభుత్వం గుర్తించి ఇళ్ల పట్టాలు జారీ చేసింది. కానీ ఇంతవరకు ఆయా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపించలేదు. దీంతో పేదలంతా ఆందోళన చేయడంతో మండల కేంద్రానికి దూరంగా కొండపై స్థలాలు ఇస్తామని చెప్పారు. దీనికి లబ్ధిదారులు అంగీకరించలేదు. పట్టణాన్ని విడిచిపెట్టి కొండపైకి వెళ్లేందుకు ఒప్పుకోలేదు. నెల్లిమర్లలోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వారికి రెండేళ్లుగా స్థలాలు కేటాయించకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ వ్యవహారం తేలకముందే గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి పట్టణ నడిబొడ్డున స్థలాలు ఇచ్చారని తెలియడంతో పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత తేదీలు వేసి ప్రభుత్వ భూములు అమ్ముకోవడానికి రెవెన్యూ అధికారులకు ఎవరు హక్కు ఇచ్చారని మండిపడుతున్నారు. ఏదేమైనా ఇలాంటి పట్టాలపై విచారణ చేపట్టి, పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఖాళీలను భర్తీ చేయాల్సిందే

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న నాలుగో తరగతి ఉద్యోగాలను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మువ్వల గంగా ప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మువ్వల గంగాప్రసాదరావు ఆధ్వర్యాన సంఘం కార్యాలయంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మురళి ప్రారంభించారు. శిబిరంలో 86 మందికి కుమారస్వామి కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేసి, 28 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా శస్త్రచికిత్స చేయనున్నట్లు మేనేజర్ బాబ్జి తెలిపారు. ముందుగా సంఘం వ్యవస్థాపకులు వి.భద్రయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వై.ఆనంద్, పెన్షనర్ సంఘం జిల్లా కార్యదర్శి జి.నారాయణరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ రవి యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, పట్టణ ఉపాధ్యక్షులు బి.పైడితల్లమ్మ, కార్యదర్శి గంగి రమేష్, కోశాధికారి జి.అప్పారావు, ఎం.మంగరాజు, బి.జయబాబు, చందక శ్రీనివాసరావు, పి.రామలక్ష్మి పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు

కరోనా పట్ల అప్రమత్తం

- లక్షణాలు కనిపిస్తే వైద్య పరీక్షలు
- ఆస్పత్రులన్నింటినీ అలెర్ట్ చేశాం
- భౌతిక దూరం పాటిస్తూ మాస్కులు ధరించాలి
- 'ప్రజాశక్తి'తో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రమణ కుమారి ముఖాముఖి

కరోనా పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్‌వి రమణ కుమారి సూచించారు. లక్షణాలు కనిపిస్తే కరోనా పరీక్షలు చేసుకోవాలని, పరీక్షలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఒమిక్రాన్ సబ్ వేరియంట్ (బిఎఫ్-7) వైరస్ వ్యాప్తి చెందుతున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆస్పత్రులన్నింటినీ అప్రమత్తం చేశామని స్పష్టంచేశారు. ప్రజలు కూడా భౌతిక దూరం పాటిస్తూ మాస్కులు ధరించాలని, శానిటైజర్లు వినియోగించాలని సూచించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి డిఎంహెచ్ఒ ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు....

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

? మన జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు ఏమైనా ఉన్నాయా?.

ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పిహెచ్‌సి పరిధిలోనూ దగ్గు, జ్వరం, గొంతు నొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్న ముగ్గురి చొప్పున మూడు రోజులపాటు కరోనా పరీక్షలు నిర్వహించాం. ఒక్కటీ పాజిటివ్ కేసుగా నమోదు కాలేదు.

? కేసులు నమోదు కానప్పుడు అప్రమత్తత ఎందుకు?.

జిల్లాలో పాజిటివ్ కేసులు నమోదు కాకపోయినప్పటికీ ఒమిక్రాన్ సబ్ వేరియంట్ (బిఎఫ్-7) అనే వైరస్ వ్యాప్తి చెందుతున్నట్టు వార్తలు వినవస్తున్నాయి. ఇతర జిల్లాల్లో అక్కడక్కడ నమోదవుతున్న నేపథ్యంలో మన జిల్లా వాసులు కూడా అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. తొలి విడతలో మన జిల్లా కొన్ని నెలలపాటు గ్రీన్‌జోన్‌లో ఉన్నప్పటికీ ప్రజల రాకపోకల వల్ల కరోనా సోకక తప్పలేదు. కానీ, గ్రీన్‌జోన్ సమయంలోనైనా జిల్లా ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారు. అప్రమత్తంగా మెలగడం వల్ల ఇతర జిల్లాలతో పోల్చుకుంటే పాజిటివ్ కేసులు, మరణాలు తగ్గాయి. దాన్ని గుణపాఠంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

? కరోనా టెస్టులు నిర్వహిస్తున్నారా?.

తల, గొంతు నొప్పులు, తీవ్రమైన దగ్గు, జ్వరం, కాళ్లపీకులు వంటి కరోనా లక్షణాలతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇందుకు అవసరమైన కిట్లు అన్ని పిహెచ్‌సిల్లోనూ అందుబాటులో ఉన్నాయి. వైద్యులు, సిబ్బందికి అవసరమైన మాస్కులు, శానిటైజర్లు వంటి రక్షణ కవచాలు కూడా సిద్ధంగానే ఉన్నాయి.



? ప్రభుత్వ సన్నద్ధత ఎలా ఉంది?.

ప్రభుత్వ ఆస్పత్రులన్నీ అప్రమత్తంగా ఉన్నాయి. ఆస్పత్రుల్లో బెడ్లు, వాటి సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది నియామకాలు, ఖాళీల భర్తీ, ఆక్సిజన్ టవర్లు, సిలిండర్లు తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. జిల్లా వ్యాప్తంగా 42 పిహెచ్‌సిలు ఉండగా, వాటిలో రెండేసి వైద్య అధికారుల పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం ఒకే ఒక వైద్య పోస్టు ఖాళీగా ఉంది. అర్బన్ హెల్త్ సెంటర్లలో మూడు ఖాళీలు ఉన్నాయి. కరోనా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వాటిని సాధ్యమైన త్వరలో భర్తీచేసేందుకు ప్రయత్నిస్తున్నాం. కరోనాను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలంటూ ఇప్పటికే జిల్లా కలెక్టర్ సమావేశాలు, ఫీల్డ్ విజిటింగ్‌లు నిర్వహించారు.

? ప్రజలకు మీరిచ్చే సందేశం ఏమిటి?.

అసలే పండగ సీజన్. ప్రయాణ సమయంలో జాగ్రత్తగా మెసులుకోవాలి. భౌతిక దూరం, మాస్కు ధరించడం, శానిటైజర్ వినియోగం కనీసం కర్తవ్యంగా తీసుకోవాలి. కరోనా లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి టెస్టులు చేయించుకోవడం మేలు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను కొనసాగించాలి

వేపాడ : ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్‌ను యధావిధంగా కొనసాగించాలని మండల దళిత మహాసభ అధ్యక్షుడు కొమ్మనాపల్లి రాము డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఎస్‌సి ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను వైసిపి ప్రభుత్వం సక్రమంగా విడుదల చేయడం లేదన్నారు. ఇంతవరకు జిల్లాలో ఏ ఒక్కరికి జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సేవా సంఘం నుండి సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదని అన్నారు. సబ్‌ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు.

ప్రోత్సాహమిస్తే మరింత రాణింపు

ఊరేగింపుగా వస్తున్న రవి, శ్యామ్

శృంగవరపుకోట: ప్రతిభ ఉన్నవారికి ప్రోత్సాహాన్నందిస్తే వారు ప్రతిభను ప్రదర్శించి మరింత రాణిస్తారని ఆంధ్ర యూని వర్సిటీ పిహెచ్‌డి స్కాలర్ చిప్పాడ శేషగిరిరావు అన్నారు. అందుల క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్లో బంగ్లాదేశ్ పై విజయం సాధించి విజేతగా నిలిచిన అమిట రవి, రాష్ట్రస్థాయిలో జరిగిన పాడుతా తీయగా సింగర్‌గా మంచి పేరు తెచ్చుకున్న సింగర్ మోపాడ శ్యామ్‌లకు ఆదివారం పట్టణంలోని ఎరుకమ్మ పేరంటాలు కళ్యాణ మండపంలో దాసరి యువత ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ రవి, శ్యామ్‌లు దాసరి ఆణిముత్యాలని కొనియాడారు. ముందుగా పట్టణంలోని సాయిబాబా గుడి నుండి తీన్మార్ డబ్బులు, బాణాసంచాతో ఊరేగింపుగా బయలుదేరి గ్రామ దేవత దార గంగమ్మ దర్శించుకుని అనంతరం మెయిన్ రోడ్డు గుండా ఎరుకమ్మ పేరంటాలు కళ్యాణ మండపానికి ఊరేగింపు చేరుకొని వారికి అక్కడ ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున దాసరి కుల పెద్దలు యువకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి

శిక్షణతో ఉపయోగం : పీడీ

నెల్లిమర్ల : అగరబత్తి, డూప్‌టిక్స్ శిక్షణతో మహిళలకు ఉపయోగమని డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి అన్నారు. మండలంలోని రామతీర్థం, డెంకాడ మండలంలోని అక్కివరంలోని అగరబత్తి, డూప్‌టిక్స్ శిక్షణా కేంద్రాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడుతూ శిక్షణ అనంతరం యూనిట్ స్థాపించి అందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి కె. సావిత్రి, ఏరియా కో ఆర్డినేటర్ జి. సీతారామయ్య, రామతీర్థం ఇఒ డి.వి.వి. ప్రసాద్, శిక్షణ నిర్వాహకులు స్రాకో సంస్థ తరపున సునీత ప్రసాద్, డిపిఎం లక్ష్మనాయుడు, చేయూత డిపిఎం రవి, ఏపిఎం సత్యనారాయణ, డెంకాడ ఎపిఎం విజయలక్ష్మి, సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షులు, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

నేడు రామతీర్థంలో వైకుంఠ ద్వార దర్శనం

నెల్లిమర్ల : రామతీర్థం రామస్వామి దేవస్థానంలో వైకుంఠ ద్వార దర్శనం సోమవారం ప్రారంభం కానుంది. ఈ నెల 2న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనంతో భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటారు. దీనిలో భాగంగా అర్చకులు తెల్లవారు జామున స్వామి ఆరాధన, తిరుప్పావై సేవా కాలం, మంగళా శాసనం, తీర్థ గోష్ఠి నిర్వహించి వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభిస్తారు. అనంతరం రామస్వామి గ్రామ తిరువీధి ఉత్సవం జరిపించి మెట్లోత్సవం, గోపూజ, గిరి ప్రదక్షిణ నిర్వహిస్తారు. కాగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాల ఏర్పాట్లు దేవస్థాన సహాయ కమిషనర్ డి.వి.వి ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

ఎపిజిఇఎ కేలండర్ ఆవిష్కరణ

విజయనగరం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) నూతన కేలండర్‌ను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతోనే జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతున్నామని తెలిపారు. నూతన సంవత్సరంలో ఇదే సహకారం కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో ఎపిజిఇఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రామచంద్రరావు, కంది వెంకటరమణ, జిల్లా కోశాధికారి వై.శంకరరావు, ఉపాధ్యక్షులు బాలాజీ పాణిగ్రాహి, పింఛనుదారుల కార్యవర్గ సభ్యులు పి.వి.రమణ, జిల్లా సంయుక్త కార్యదర్శి లెంక సత్తిబాబు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై వేధింపులు దారుణం

బాడంగి : ఎరుకలపాకలు గ్రామంలో గిరిజనులపై విద్యుత్తు శాఖాధికారులు వేధింపులకు పాల్పడటం దారుణమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముగడ వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్తు శాఖాధికారులు చేసిన పనికి గిరిజనులు ప్రమాదం ముంగిట్లో ఉన్నారని, వారిపై అధికారులకు ఎందుకంత కక్షని ప్రశ్నించారు. విద్యుత్తు శాఖాధికారుల వేధింపులు ఆపి, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను విద్యుత్తు శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అప్పటికీ పరిష్కరించకుంటే నిరాహార దీక్ష చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

యుటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం యుటిఎఫ్ కేలండర్‌ను యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, బి.ప్రసాద్, బి.రామకృష్ణ, మధుసూదనరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే యుటిఎఫ్ పనిచేస్తుందని ఉపాధ్యాయుల కోసం మెరుగైన సమాచారం అందించేందుకు ఈ కేలండర్ ఎంత ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కేలండర్‌ను ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, శ్రీనివాసరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆదివారం యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఎంఇఒ జె.నారాయణస్వామి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కూర్మారావు, మండల ప్రధాన కార్యదర్శి పి ప్రసాద్ రావు, అధ్యక్షులు భాస్కరరావు, గౌరవ అధ్యక్షులు ఎం చలపతిరావు తదితరులు ఉన్నారు.

వీరఘట్టం : మండలంలోని వండువలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి రాష్ట్ర ఉపాధ్యాయ పండితుపరిషత్తు క్యాలెండర్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వి.మహేష్ , వై.రాజు, తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు

ప్రజాశక్తి- మెరక ముడిదాం

పార్టీలతో సంబంధం లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చినబంటుపల్లి గ్రామంలో ఆదివారం నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కొత్తగా 280 పింఛన్లు వచ్చాయన్నారు. ఈ నేల నుండి ప్రతి పింఛను దారునకు రూ.2750 అందుతుందన్నారు. అర్హత ఉండి పింఛన్లు అందకపోతే వాటిని కూడా పరిశీలించి మంజూరుకు సహకరిస్తామన్నారు. ప్రభుత్వం పింఛన్లు తొలగిస్తుందని పత్రికల్లో వస్తున్న కథనాలను నమ్మవద్దన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారమే పింఛన్లు వర్తింపు, తొలగింపు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణరాజు,


ఎస్‌కోట: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

కోట్ల మోతిలాల్ నాయుడు, కోట్ల వెంకటరావు, వైస్ ఎంపిపిలు హరి బాబు, కందుల పార్వతి, కేఎస్ఆర్కే ప్రసాద్, పప్పల కృష్ణ మూర్తి, గ్రహణేశ్వరరావు, ఎంపిడిఒ రామకృష్ణ, తహశీల్దార్ రత్నకుమార్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : సామాజిక పింఛను మొత్తాన్ని ప్రభుత్వం రూ.2,500ల నుంచి రూ.2,750లకు పెంచిన సందర్భంలో నిర్వహిస్తున్న పింఛను వారోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం మండలంలోని బొడ్డవర సచివాలయ పరిధిలో పలువురు లబ్దిదారులకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైస్ ఎంపిపి సుధారాజు పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలోని మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సంతోషి కుమారి, ఎంపిపి ఎస్. సోమేశ్వరరావు, పంచాయతీ ఇఒ పాత్రో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డవర సర్పంచ్ మీనా, నాయకులు మురళీరాజు, సన్యాసిదేముడు, పంచాయతి కార్యదర్శి బంగారునాయుడు, గ్రామ వాలంటీర్లు తదితలులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో పెంచిన 250 రూపాయలు కలుపుకొని రూ.2750లను లబ్ధిదారులకు ఆదివారం సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి గ్రామ పెద్దలు సమక్షంలో నేరుగా లబ్ధిదారునికి అందజేశారు. వావిలపాడులో సర్పంచ్ బీల రాజేశ్వరి చేతులు మీదుగా పింఛన్లను పంపిణీ చేశారు. జాకేరు సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, బుద్ధ అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ బుద్ధా కృష్ణ చేతుల మీదుగా పెరిగిన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి, పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని 39 గ్రామపంచాయతీలో 241 వివిధ రకాల సామాజిక పింఛన్లు నూతనంగా మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం అంబాడ వెంకటాపురం గ్రామంలో ఎంపిపి ధార అప్పల నరసమ్మ నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారందరికీ రాజకీయాలకు అతీతంగా సామాజిక పింఛన్లు మంజూరు చేసే ఘనత వైకాపా ప్రభుత్వానిదేనని అన్నారు. అప్పాపురం, మజ్జి రాముడుపేట గ్రామాల్లో సర్పంచ్ కరణం నిర్మల, వైసిపి నాయకులు కరణం శ్రీనివాసరావు, సంకిలి సచివాలయ పరిధి వెల్ఫేర్ అసిస్టెంట్ సుప్రియ అర్హులైన వారందరికీ నూతన పింఛన్లు పంపిణీ చేశారు. అంబాడ వెంకటాపురం సర్పంచ్ చుక్కా వెంకట నాయుడు, వైసిపి నాయకులు చుక్క వేణునాయుడు, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: పింఛన్లను పంపిణీ చేస్తున్న జిల్లా పరిషత్తు చైర్మన్

సింగుబాబుకు పరామర్శ

నెల్లిమర్ల : మాజీ జెడ్‌పిటిసి డి.శంకర సీతారామరాజు (సింగుబాబు)ను టిడిపి నాయకులు పరామర్శించారు. ఆదివారం కొండ వెలగాడ మాజీ జెడ్‌పిటిసి స్వగృహంలో టిడిపి నియజకవర్గ ఇంఛార్జి పతి వాడ నారాయణ స్వామి నాయుడు, నాయకులు మహంతి చిన్నం నాయుడు, పతివాడ తమ్ము నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, మండల తెలుగు యువత అధ్యక్షులు నల్లం శ్రీనివాసరావు, ఆకిరి ప్రసాద్ పరామర్శించారు. గత కొంత కాలంగా సింగు బాబు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

సింగుబాబును పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేస్తున్న యుటిఎఫ్ నాయకులు

సావిత్రిబాయి స్ఫూర్తితో బాలికలు చదవాలి

బొబ్బిలి : దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయ రాలు సావిత్రిభాయి పూలే స్ఫూర్తితో బాలికలు చదువుకో వాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె. విజయగౌరి కోరారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం సావిత్రిభాయి పూలే జయంతోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలికల విద్య ప్రోత్సహించేందుకు సావిత్రిభాయి పూలే చేసిన కృషి మరువలేనిదన్నారు. అన్ని అవమానాలు ఎదురైన బాలికల విద్యకు పని చేసారని కొనియాడారు. బాలికలు బాగా చదివి ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, బి.రమేష్, కె.కృష్ణదాసు పాల్గొన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ

గంట్యాడ : నూతన సంవత్సరాన్ని పురష్కరించుకుని మురపాక గ్రామంలో యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ చెత్త బకెట్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన యువకులు, పారిశుధ్యం మెరుగుపర్చాలని ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పించారు. దీంతో పాటు దేవాలయాలకు చెత్త బకెట్లును అందించారు. వెనుకబడిన కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఇక మీదట గ్రామ యువత అంతా కలిసి తమ గ్రామాన్ని సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించాలని ఆశయంతో ముందుకు వెళతామని చెప్పారు.

చెత్త బకెట్లు పంపిణీ చేస్తున్న యువత

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


బొబ్బిలి: లిగో గ్రీన్ పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ, బేబినాయన

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కోటలో మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు టిడిపి కార్యకర్తలు, అభిమానులు, నాయకులు క్యూ కట్టారు. కోటలో నిర్వహించిన రేలారే రేలా అభిమానులను ఉత్తేజ పరిచింది. గొల్లపల్లిలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణకు వైసిపి పట్టణ నాయకులు, కౌన్సిలర్లు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మాజీ సభ్యులు తూముల భాస్కరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ తూముల అచ్యుతవల్లికు, వైసిపి పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, బుడా చైర్మన్ ఇంటి పార్వతికు అధికారులు, నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సర వేడుకలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు దూరంగా ఉన్నారు.

ఉర్రూతలూగించిన రేలారే రేలా

నూతన సంవత్సరం సందర్భంగా కోటలో నిర్వహించిన రేలారే రేలా అభిమానులు, కార్యకర్తలను ఉర్రూతలూగించింది. గాయకులు జానపద, సినీ పాటలతో, కళాకారులు డప్పులు వాయిద్యాలతో అభిమానులను ఉర్రూతలూగించారు. రేలారే రేలా చూసేందుకు టిడిపి కార్యకర్తలు, అభిమానులు ఆసక్తి చూపారు.

రోటరీ ఆధ్వర్యంలో.. రోటరీ అధ్యక్షులు జెసి రాజు ఆధ్వర్యంలో మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు, బేబీ నాయనలను కోటలో కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023 సంవత్సరం పర్యావరణానికి ప్రాధాన్యత నివ్వాలని కోరుతూ రోటరీ రూపొందించిన లిగో గ్రీన్ గోడ ప్రతులను వారిచేత విడుదల చేయించారు. అనంతరం సిహెచ్‌సి వైద్యులకు, సిఐ జైభీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు శ్రీహరి, శంకరరావు, శ్రీనివాసన్, డేవిడ్ జె విక్టర్, అవినాష్, ప్రవీణ్ కుమార్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగారు రాజు స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. భారీ ఎత్తున నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ, నెల్లిమర్ల, డెంకాడ మండలాలకు చెందిన కార్యకర్తలు ముఖ్య నేతలు అంతా గ్రామం చేరుకొని బంగార్రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, నాయకులు కర్రోతు రాజు, నీలాపు అప్పల రామిరెడ్డి, కోరాడ తాతారావు, గరికిపేట నాయకులు చింతపల్లి సత్యనారాయణ, బెల్లాన అచ్చింనాయుడు, మహంతి రాజారావు, శ్రీను, ఈశ్వరరావు, నాగ, బంగారునాయుడు, రమణ, మూడు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడ : మండలానికి చెందిన వైసిపి నాయకులు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును తన స్వగృహం ఎస్‌కోటలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిపి దొగ్గ సత్యవంతుడుకు తన స్వగృహంలో మండల నాయకులు, కార్యకర్తలు, వైసిపి అభిమానులు పెద్ద ఎత్తున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు సత్యనారాయణ పాల్గొన్నారు.

బొబ్బిలిలో రేలారేరేలా సందడి

తగ్గిన పువ్వులు వ్యాపారం

బొబ్బిలి: నూతన సంవత్సరం సందర్భంగా పువ్వులు వ్యాపారం బాగా అవుతుందని వ్యాపారులు ఆశించినప్పటికి జరగలేదు. పువ్వులు వ్యాపారం తగ్గడంతో వ్యాపారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. నూతన సంవత్సరం ఆదివారం కావడంతో ప్రభుత్వ కార్యాల యాలు, విద్యా సంస్థలకు సెలవు కావడంతో వ్యాపారం తగ్గిందని వ్యాపారులు వాపోతున్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉండడంతో వ్యాపారం తగ్గిందని వ్యాపారులు వాపోతున్నారు. రాజులు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనడంతో వ్యాపారం కాస్త జరిగి నష్టపోకుండా ఉన్నామని వ్యాపారులు చెపుతున్నారు.

విజయనగరంటౌన్, కోట: సిఎం జగన్ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ అభిలషించారు. ఈశ్వర్ కౌశిక్ ఆధ్వర్యంలో సుజాత కన్వెన్షన్‌లో నూతన సంవత్సర వేడుకల్లో వారు కేకును కట్ చేశారు. వీరికి కార్పొరేటర్లు, నాయకులు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


విజయనగరం: అశోక్ గజపతిరాజు దంపతులను సత్కరిస్తున్న నాయకులు

అశోక్ బంగ్లాలో.. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు, సునీలా గజపతిరాజు ఆధ్వర్యాన నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు, నాయకుల మధ్య కేక్ కట్ చేసి, అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

డిసిఎంఎస్ కార్యాలయంలో.. డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన కేకు కట్ చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అవనాపు విక్రమ్, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ల గౌరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో.. సీనియర్ నాయకులు గురాన అయ్యలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జనసేన లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు డోల రాజేంద్రప్రసాద్, నాయకులు ఆదాడ మోహనరావు, ఎం.దుర్గాప్రసాద్, త్యాడ రామకృష్ణారావు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో.. డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్ కేకు కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుంకర సతీష్ కుమార్, రాష్ట్ర ట్రైనింగ్ సెల్ చైర్మన్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షరీఫ్, చంద్రశేఖర్, బిసి సెల్ జిల్లా చైర్మన్ శ్రీనివాసరావు, సూర్యనారాయణ, నాయుడు పాల్గొన్నారు.

విజయనగరం: ఎస్‌పి బంగ్లాలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్‌పి దీపిక పాటిల్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు ఉన్నతాధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

భోగాపురం: టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతుకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

విజయనగరం: ఎస్‌పికి శుభాకాంక్షలు చెబుతున్న పోలీసులు

వేపాడ: ఎంపిపికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

కొండపేటలో టిడిపి 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

నగర పంచాయతి పరిధి కొండ పేటలో టిడిపి ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం పట్టణ టిడిపి అధ్యక్షులు బైరెడ్డి లీలావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, స్పోక్స్ పర్సన్ లెంక అప్పల నాయుడు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి మట్లాడుతూ అధికార వైసిపి వైఫల్యాలను ఎండగట్టి టిడిపికి మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బైరెడ్డి నాగేశ్వర రావు, పతివాడ తమ్మినాయుడు, మహంతి శంకరరావు, ఆకిరి ప్రసాద్, కాళ్ల రాజశేఖర్, నడిపేన నారాయణ రావు, ఇజ్జిరోతు ఈశ్వరరావు, యువ నాయకులు బైరెడ్డి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి

మృతుడు వాసు

నూతన సంవత్సర వేడుకలలో అపశృతి చోటు చేసుకుంది. వేడుకలు జరుపుకొని ఆదివారం తెల్లవారు జామున పెట్రోల్ కోసం ద్విచక్ర వాహనంపై పెట్రోల్ బంకుకు వెళ్తుండగా కారును ఢీకొనడంతో గొల్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు గలగట్ల వాసు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వాసు మరణంతో గొల్లపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైరి నరేష్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

హిందూ దేవుళ్లను కించపరిచేలా భారత నాస్తిక సమాజం సభ్యుడు బైరి నరేష్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ ఆదిభట్ల కలాపీఠం జిల్లా అధ్యక్షులు గోవింద్ ప్రకాష్ ఎస్‌కోట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనది హిందూ భారతదేశం అయిప్పటికీ అన్నిమతాలను కలుపుకుంటూ లౌకిక రాజ్యాంగ ఏర్పడి అందరం అన్నదమ్ముల్లా ఉన్న మనదేశంలో బైరి నరేష్ వ్యాఖ్యలు మత విద్వేసాలు రెచ్చగొట్టే విధంగా అయ్యప్పను కించపరుస్తూ మాట్లాడాడని అతనిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముగ్గు ధర్మారావు, వసంత కృష్ణ, హిందూ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

న్యూఇయర్ వేడుకల్లో విషాదం

కబడ్డీలో గాయపడి యువకుడు మృతి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

రమణ(ఫైల్)

కబడ్డీ ఆటలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి యువకుడు నేలపై పడటంతో మెడకు తీవ్రగాయాలై చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. డిసెంబరు 31వతేదీ రాత్రి మండలంలోని వెంపడాం గ్రామంలో కబడ్డీ పోటీలు జరిగాయి. కొవ్వాడ, ఎరుకొండ జట్లు మధ్య కబడ్డీ హోరాభహోరీగా సాగుతోంది. ఈ నేపథ్యంలో కొవ్వాడ గ్రామానికి చెందిన యువకుడు కూతకు వెళ్లాడు. కూతకు వచ్చిన వ్యక్తిన పట్టుకొనే క్రమంలో ఎరుకొండకు చెందిన క్రీడాకారుడు అత్తి రమణ (18) అదుపుతప్పి నేలపై పడటంతో మెడ విరిగింది. చికిత్స నిమిత్తం విజయనగరం తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుండి విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం యువకుడు మృతి చెందాడు. అనుకోని ప్రమాదంలో కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శ్రీనువాసురావు, భూలక్ష్మిలు బోరున విలపించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కెజిహెచ్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.